## క్లుప్తంగా

### పొదుపు.. భవిష్యత్తుకు మలుపు



మాట్లాడుతున్న మురళీకృష్ణ

వెదురుకుప్పం: నగదును పొదుపు చేసుకోవడం ద్వారా భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని వెదురుకుప్పం ఇండియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకులో పొదుపు ఖాతాలు తెరవాలన్నారు. పొదుపు చేసుకోవడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ.. డబ్బులు పొదుపు చేసుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునేందుకు దోహదపడుతుందన్నారు. పొదుపు ఆవశ్యకతను వివరించారు.

### అడ్మిషన్లకు గడువు పెంపు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ టి.నరసింహులు తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ రెండేళ్ల కోర్సు, డిప్లమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు యూనివర్సిటీ పోర్టల్ www.bsoauonine.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ద్వితీయ, తృతీయ ఏడాది విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 20వ తేదీ ఆఖరి గడువని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### 4న నెట్టేరి ఉప సర్పంచ్ ఎన్నిక

నిండ్ర: మండలంలోని నెట్టేరి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 4వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుణ తెలిపారు. సమావేశానికి సర్పంచ్, వార్డు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన

విజయపురం (నగరి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. శుక్రవారం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షానికి వాతావరణ మార్పుతో జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. రాత్రి పూట దోమతెర వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. జలుబు, జ్వరం తగ్గకుండా ఉంటే పీహెచ్‌సీలో రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు.

### సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ సిబ్బంది

నగరి: విజయపురం మండలం కేవీపురం గ్రామంలో సారా విక్రయిస్తున్న ఆర్.కాటయ్య (47)ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వర్ధనాదేవి శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తనిఖీలో ఎస్ఐ భానుప్రకాష్, హెడ్‌కానిస్టేబుల్ బాలముని, మోహన్‌రెడ్డి, పీసీలు హిదయతుల్లా, కార్తిక్, గురవయ్య పాల్గొన్నారు.

### రేపు కావనూరులో వైద్య శిబిరం

నిండ్ర: కావనూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సన్‌ప్రైమ్ మల్టి స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం జరగనుంది. గుండె జబ్బులు, థైరాయిడ్, గైనకాలజీ, మధుమేహం, క్యాన్సర్ తదితర వాటికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయనున్నారు. పూర్తి వివరాలకు 9533544544 నంబర్‌లో సంప్రదించవచ్చు.

### విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నగరి: పుత్తూరుకు చెందిన కె.మురగారెడ్డి అనే న్యాయవాదిపై కొందరు చేయిచేసుకోవడాన్ని ఖండిస్తూ నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టుకు చెందిన న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం విధులను బహిష్కరించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమల్లోకి తెచ్చి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదులు సుబ్రమణి రెడ్డి, సోమసుందరి, ఉదయభాను, మహదేవన్, బాబు, ఈజీ బాబు, ధరణి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.





# నగరి అభివృద్ధిపై రాజన్న ముద్ర

**నగరి నియోజకవర్గంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులు నేటికి ఆయన్ను గుర్తుచేస్తూ ఉన్నాయి. అభివృద్ధి పనుల రూపంలో ఆయన సజీవంగా నగరి ప్రజలకు కనిపిస్తూనే ఉంటారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించేందుకు సిద్ధమయ్యారు.**

- నేడు వైఎస్సార్ వర్ధంతి

నగరి: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు శ్రీశైలం జలాశయం నుంచి మిగులు జలాలను తరలించి సాగు, తాగునీరు అందించడానికి చేపట్టిన గాలేరు నగరి సుజల స్రవంతి పథకాన్ని జలయజ్ఞంలో భాగంగా 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. దీని ద్వారా జిల్లాలోని 1,03,500 ఎకరాలకు సాగునీరు అందించడానికి, ప్రజలకు తాగునీరు అందించడానికి ఈ పథకానికి రూపకల్పన చేశారు. 430 కిలోమీటర్లు సాగే ఈ ప్రాజెక్టు కాలువ 254వ కిలోమీటర్ వద్ద మన జిల్లాకు ప్రవేశించేలా ఏర్పాటు చేశారు. మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్, పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్ అక్కడి నుంచి పుత్తూరు



గాలేరు నగరి కాలువ

మండలం వేపగుంట రిజర్వాయరుకు చేరి అక్కడి నుంచి నగరి రూరల్ మండలంలోని అడవికొత్తూరులో నిర్మించే రిజర్వాయరుకు చేరుకుంటుంది. మహానేత పాలనలో 70 శాతం పూర్తయిన ఈ ప్రాజెక్టు పనులు తదుపరి పడకేసింది. ప్రస్తుతం మంత్రి ఆర్కేరోజా కోరిక మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనులు వేగవంతం చేస్తున్నట్లు నగరి వేదికపై ప్రకటించారు.

**రసాయన నీటిని శుద్ధీకరించే ఈటీపీ ప్లాంటు**

నేత కార్మికులు నూలుకు రంగువేసే ప్రక్రియలో వెలువడే రసాయన నీటి కారణంగా భూగర్భ జలాలు కలుషితమతుండడంతో కొన్నేళ్ల క్రితం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ప్రతి డైయింగ్ యూనిట్‌కు ఈటీపీ అమర్చుకోవాలని లేకుంటే మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. డైయింగ్ యూనిట్లు ఈటీపీ పెట్టుకోవాలంటే రూ.20 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత ఖర్చుచేయలేని స్థితిలో వారు ఉండడంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రసాయన నీటిని శుభ్రపరిచే కామన్ ఈటీపీ ప్లాంటు ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు. ఇందు కోసం రూ.14 కోట్లు మంజూరు చేశారు. ఆయన పాలనలో వేగంగా జరిగిన పనులు టీడీపీ పాలనలో పడకేసింది. మంత్రి ఆర్కేరోజా ప్లాంటును ప్రారంభించి వినియోగంలోకి తెచ్చారు.

**వంద పడకల ఆస్పత్రి**

వైఎస్సార్ పాలనలో నగరికి రూ. 15 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి మంజూరైంది. అత్యాధునిక హంగులతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభమైన ఈ ఆస్పత్రి ఆయన మరణానంతరం 60 పడకలకే పరిమితమైంది. వైస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆస్పత్రి అభివృద్ధికి నాడు–నేడు పథకంలో రూ.5.4 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దశాబ్దకాలం పైగా ఉన్న దారి సమస్య పరిష్కారమైంది. మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అదనపు పడకలు, వైద్య సామగ్రి, కుర్చీలు అందజేశారు.

**సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు**

తాగునీటి సమస్యకు శాస్వత పరిష్కారం చూపడానికి మున్సిపల్ పరిధిలోని సత్రవాడ శివారుల్లో రూ.36 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. వర్షాలకు సమ్మర్ స్టోరేజ్ నీటితో నిండి మున్సిపల్ ప్రజల దాహార్తిని తీరుస్తోంది. ప్రస్తుతం ఆ ట్యాంకులో నీటిని ప్లాంటు ద్వారా శుద్ధీకరించి మున్సిపాలిటీకి నీటిని సరఫరా చేస్తున్నారు.



ఆధునీకరించిన ఆస్పత్రి భవనాన్ని ముఖ్యమంత్రి ఆగస్టు 28వ తేదీ ప్రారంభించారు.

### పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

విజయపురం (నగరి): పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు వృద్ధి చెందవని.. తద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. గ్రామాల్లో మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. బోరు, నీటి కొళాయి వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగనన్న ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

### సమయపాలన పాటించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాలకృష్ణాపురం, ఆముదాల, నరసింహాపురం, తిరుమలరాజుపురం సచివాలయాలను ఆయన సందర్శించారు. ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



పర్యావరణ సదస్సులో విద్యార్థులు

రేణిగుంట: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఏపీ ఎన్‌జీసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ నీలకంఠ అన్నారు. మండలంలోని కరకంబాడి ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏపీ నేషనల్ గ్రీన్ క్రాప్స్, ఎంవోఈఎఫ్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్‌పై ఫారిన్ మినిస్టర్ ట్రాక్, లీడర్స్ మోడల్ జీ–20 సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కొక్క దేశం అధ్యక్షులు, ప్రధానిగా మాక్ డ్రిల్ నిర్వహించి ఆ దేశాల్లో వారు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను తెలుపుతూ పరిష్కార మార్గాలను వివరించారు. 10వ తరగతి విద్యార్థిని నందిని భారత ప్రధానమంత్రిగా మారి మన దేశంలోని పర్యావరణ సమస్యను తెలియజేశారు. పలువురు విద్యార్థులు ఆయా దేశాల ప్రతినిధుల వేషధారణలో పాల్గొని అక్కడ నెలకొన్న పర్యావరణ పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఇందిరాదేవి, హెచ్‌ఎం పుష్పలత, జిల్లా కో–ఆర్డినేటర్ హరిశంకర్, నేమిలేటి కిట్టన్న, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్ ప్రతినిధి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు



కూరగాయల అలంకరణలో సత్యమ్మ తల్లి

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం, చెరుముందరకండ్రిగ గ్రామాల్లో సత్యమ్మ దేవతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి చందనాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అంబలి, పొంగలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం కూరగాయలతో సుందరంగా అలంకరించారు.

## అక్రమ మోటార్ల తొలగింపునకు శ్రీకారం



టీఆర్‌కండ్రిగలో పైప్‌లైన్ పనులు

పుత్తూరు రూరల్: తడుకు పంచాయతీ పరిధిలోని టీఆర్ కండ్రిగ హరిజనవాడలో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభమయ్యాయి. గత గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ ఇందిర మాట్లాడుతూ టీఆర్ కండ్రిగ హెచ్‌డబ్ల్యూలో కొందరు మోటార్ల ద్వారా నీటిని తోడుకోవడం వల్ల దిగువన ఉన్న వారికి నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై తడుకు సర్పంచ్, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఎట్టకేలకు స్పందించిన తడుకు సర్పంచ్ వెంకటేష్ శుక్రవారం కాలనీలో వాటర్ పైపులైన్ పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తరుణ్ మాట్లాడుతూ.. గ్రామంలో దిగువ ప్రాంతానికి వాటర్ పైపులైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పంచాయతీ నిధులు రూ.50 వేల అంచనాతో 60 మీటర్ల మేరకు పైపులు వేస్తున్నట్లు వివరించారు. అక్రమ మోటర్లను గుర్తించి తొలగిస్తామని తెలిపారు. దీంతో అందరికి సక్రమంగా నీరు అందుతుందని స్పష్టం చేశారు.

## తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ చిద్విలాసం



తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శ్రీకృష్ణ ముఖమండపం వద్దకు వేంచేపు చేసి కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం తిరుచ్చి వాహనంపై ఆశీనులైన అమ్మవారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

### కొత్త పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పాలసముద్రం: మండలంలో కొత్తగా 121 మందికి మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. పాలసముద్రం సచివాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ అయ్యప్ప చేతుల మీదుగా లబ్ధిదారులకు నగదుఅందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ ఆమోదం ఉంటేనే ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ఆ పార్టీ నాయకులే ఎక్కువ లబ్ధి పొందేవారన్నారు. పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తోందని తెలిపారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, రాజామణి, గోపాల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సారా ఊట ధ్వంసం.. ముగ్గురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

పుత్తూరు రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, తిరుపతి డీటీఎఫ్ బృందంతో కలిసి నారాయణవనం మండలంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ముగ్గురిని అరెస్టు చేసి 100 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నారాయణవనం మండలం వెత్తలతడుకు గ్రామంలో దాడులు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన పి.గోపి(28), పి.మోహన్(32), పి.శ్రీనివాసులు(29)లను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో పుత్తూరు ఎస్ఐ నాగరాజు డీటీఎఫ్ ఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గాయపడిన వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)

ఏర్పేడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు కందాడు దళితవాడుకు చెందిన పారి అశోక్(23) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా మునలిపేడు బత్తెనయ్య కాలనీకి సమీపంలోని గుంతలో ప డ్డాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### నేడు వైఎస్సార్ వర్ధంతి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పార్టీ నాయకులకు సూచించారు. వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పిద్దామన్నారు.

## అమ్మవారి సేవలో గాయకుడు మనో



అమ్మవారిని దర్శించుకున్న గాయకుడు మనో

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం సాయంత్రం ప్రముఖ సినీ గాయకుడు మనో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు తీర్థ ప్రసాదాలతో సత్కరించారు.

### పేదల జీవితాల్లో వెలుగులు

శ్రీరంగరాజపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవతాల్లో వెలుగులు నింపుతున్నారని కొత్తపల్లి సర్పంచ్ ఢిల్లయ్య అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్నారన్నారు. అనంతరం నూతనంగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి మాజీ సర్పంచ్ విజయాబాబు, పార్టీ మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్ధన్, కోటిరెడ్డిబాబు పాల్గొన్నారు.

### రాష్ట్ర జట్టుకు ఎంపిక

తిరుపతి కల్చరల్: రాష్ట్ర జట్టుకు తిరుపతి జిల్లా జట్టు క్రీడాకారులు ఎంపికైనట్లు డీఎస్‌డీవో, చీఫ్ కోచ్ షేక్‌సయ్యద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో నాలుగో స్థానం సాధించిన తిరుపతి జట్టు అభినందన కార్యక్రమం శుక్రవారం క్యాంపస్ స్కూల్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ సయ్యద్, జిల్లా ఒలిపింక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ హాజరై తిరుపతి జిల్లా బాలుర జట్టును ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర జట్టుకు కే.చరణ్, వెంకట ప్రభువు, బీ.కార్తీక్, ఇషాన్ అలీ తదితరులు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ నలుగురూ అనంతపురంలో జరిగే కోచింగ్ క్యాంప్‌లో పాల్గొంటారని తెలిపారు. అలాగే తిరుపతి జిల్లా బాలికల జట్టు 3, 4 తేదీలలో అనంతపురంలో జరిగే ఇంటర్ డిస్ట్రిక్‌లో పాల్గొంటారన్నారు.



రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన తిరుపతి జిల్లా క్రీడాకారులకు అభినందనలు

## టీటీడీ ఎక్స్–అఫిషియో సభ్యుడిగా ఈఓ ప్రమాణ స్వీకారం





టీటీడీ ఎక్స్అఫిషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన టీటీడీ ఈఓ ధర్మారెడ్డికి శ్రీవారి చిత్రపటం అందిస్తున్న జేఈఓ సదా భార్గవి, ఆలయంలో టీటీడీ పాలకమండలి సభ్యులు తిప్పేస్వామి

తిరుమల: టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయంలో టీటీడీ బోర్డు ఎక్స్–అఫిషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పాలకమండలి సభ్యులుగా డాక్టర్ కేతన్ దేశాయ్, డాక్టర్ తిప్పేస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత జేఈఓ సదా భార్గవి వీరి చేత ప్రమాణం చేయించారు. శ్రీవారిని ఈఓ దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. జేఈఓ శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు లోకనాథం, గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పెనుమూరు(కార్వేటినగరం): గుంటూరు ఎమ్మెల్సీ, మాజీ డీఐజీ ఏసురత్నం జన్మదినం సందర్భంగా పెనుమూరు వైఎస్సార్‌సీపీ నేత, రాష్ట్ర వడ్డెర సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్, నేతలు మురళీ, రాజేష్, హరి, యువరాజు దూది మునేంద్ర, పరందామయ్య గుంటూరులో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## వృత్తిదారుల అభ్యున్నతికే 'విశ్వకర్మ'



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : కులవృత్తిదారులు, హస్తకళాకారుల అభ్యున్నతికే కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ పథకం కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ కులవృత్తిదారులు, హస్తకళాకారులు తమ వ్యాపారాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈనెల 17వ తేదీ నుంచి ఈ పథకం అమల్లోకి వస్తుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్వయం సహాయక సభ్యులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి కులవృత్తుల వారికి అవగాహన కల్పించడంతోపాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించాలని స్పష్టం చేశారు. 18 ఏళ్లు నిండినవారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులని తెలిపారు. విశ్వకర్మ యోజన కింద మొదటి దశలో రూ.లక్ష , రెండో విడతలో రూ.2 లక్షల రుణాన్ని 5 శాతం సబ్సిడీ వడ్డీతో మంజూరు చేస్తారని వివరించారు. అలాగే నైపుణ్య శిక్షణ, పనిముట్లకు సంబంధించి రూ.15 వేల వరకు ఇన్సెంటివ్ ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో కమిటీ సభ్యుడు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ప్రతాప్ రెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ సుభాష్, ప్రోగ్రామ్ అధికారి అబ్దుల్లా , జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యామ్‌మోహన్ పాల్గొన్నారు.

### రైల్వే గేటును ఢీకొన్న కారు

పాకాల : కారు రైల్వే గేటును ఢీకొట్టిన ఘటన శుక్రవారం నేండ్రగుంట సమీపంలో చోటుచేసుకుంది. పూతలపట్టు మండలం, తోటవారిపల్లెకు చెందిన రూపేష్ అతివేగంగా కారును నడుపుతూ రైల్వే గేటును ఢీకొట్టాడు. పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## బస్సు కిందపడి విద్యార్థికి గాయాలు

కేవీబీపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థి శుక్రవారం ఆర్టీసీ బస్సు కింద పడడంతో గాయపడ్డాడు. పెరిందేశం గ్రామానికి చెందిన ప్రతాప్(15) కళాశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతూ కింద పడిపోయాడు.వెంటనే తోటి విద్యార్థులు వెనక్కి లాగేసినా, అప్పటికే చేతివేళ్లపై బస్సు టైర్లు ఎక్కేశాయి. దీంతో చేతి వేళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. అయినప్పటికీ బస్సును ఆపకుండా డ్రైవర్ నిర్లక్ష్యంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఉపాధ్యాయులు కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.